క్లుప్తంగా

యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా రియాజ్‌ఖాన్



కేసముద్రం: కేసముద్రంస్టేషన్ యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా మహ్మద్ రియాజ్ ఖాన్‌ను నియమించినట్లు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లపల్లి మహేందర్‌గౌడ్ ప్రకటించాడు. ఈ మేరకు సోమవారం రియాజ్ ఖాన్ మాట్లాడుతూ... తన నియామకానికి సహకరించిన టీపీసీసీ ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మురళీనాయక్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కంకర అయ్యప్పరెడ్డి, అసెంబ్లీ అధ్యక్షుడు గంధసిరి శ్రవణ్, టీపీసీసీ సభ్యుడు దస్రూనాయక్, డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, మండల అధ్యక్షుడు గొల్లపల్లి మహేందర్‌గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపాడు.

జిల్లా అధ్యక్షుడిగా కుమారస్వామి



కేసముద్రం: మహబూబాబాద్ జిల్లా పాస్టర్స్ అండ్ లే లీడర్స్‌కు జిల్లా అధ్యక్షుడిగా పిల్లి కుమారస్వామిని ఎన్నిక చేసినట్లు ఎడీపీఎల్‌ఎఫ్ ఫౌండర్ అండ్ చైర్మన్ బిషప్ మల్లెపాక తిమోతి, ఫౌండ్ అండ్ గౌరవ అధ్యక్షుడు జాన్ శామ్యూల్ వేమూరి సోమవారం తెలిపారు.

మిర్చి పంట పరిశీలన

నర్సింహులపేట: మండల కేంద్రంలో సోమవారం మిర్చి పంటలను ఏఈఓ రామకృష్ణ పరిశీలించాడు. మిర్చిపంటలో తెల్లదోమ, పచ్చదోమ, తామర పురుగులు, నల్లి, రసం పీల్చే పురుగులు నివారణపై రైతులకు అవగాహన కల్పించాడు. పురుగుల నివారణకు రసం పీల్చు తెల్ల, పసుపు, నీలిరంగు అట్టాలను ఎకరాకు 16నుంచి 20 అట్టాలను పెడితే 50శాతం పురుగుల నివారణ జరుగుతుందని ఏఈఓ తెలిపారు. పెగాసిస్ 40గ్రాములను ఒక లీటర్ నీటిలో 2ఎంఎల్ వేప నూనే కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు ఎరనాగి బిక్షం, రేఖ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



మరిపెడ: మరిపెడ మున్సిపాలిటీలోని 7వ వార్డుకు చెందిన గోగునాథ్ బాలాజీ అనారోగ్యంతో మృతిచెందడంతో బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ పరామర్శించాడు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించాడు. ఆయనతోపాటు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపుడి నవీన్, మున్సిపల్ చైర్మన్ సింధూర, గుగులోతు వెంకన్న, కుడితి మహేందర్‌రెడ్డి, గుగులోతు రాంబాబు, కౌన్సిలర్ శ్రీనివాస్, గుడిపుడి శ్రీధర్, దిగజర్ల శ్రీనివాస్, బోడ రూప్లా నాయక్, గోల్కొండ వెంకన్న పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



కేసముద్రం: మండలంలోని దనసరి గ్రామానికి చెందిన మాలి అశోక్ నాలుగు రోజుల క్రితం మండల కేంద్రంలో సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ యాప్ ద్వారా ఎస్సై తిరుపతి ట్రేస్ అవుట్ చేసి సెల్‌ఫోన్ ఆచూకీ తెలుసుకున్నాడు. సోమవారం పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను అశోక్‌కు అప్పగించాడు.

పోలీసుల కవాతు



మహబూబాబాద్ రూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు శాంతియుత వాతావరణంలో, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని మహబూబాబాద్ రూరల్ సీఐ రమేష్, ఎస్సై రాంచరణ్ అన్నారు. ఎన్నికల అవగాహన కార్యక్రమాల్లో భాగంగా పోలీసుల ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం పోలీసులు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలు ఎన్నికల విషయంలో ఎలాంటి భయందోళనకు గురికావల్సిన ఇబ్బంది లేదన్నారు. ఆయా గ్రామాల్లోని అన్ని వీధుల్లో బీఎస్‌ఎఫ్ సిబ్బంది, పోలీసులు తిరుగుతూ చైతన్యం కల్పించారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

మద్యం, గుడుంబా స్వాధీనం

దంతాలపల్లి: మండల కేంద్రంలో అక్రమంగా మద్యం నిల్వ ఉంచిన వ్యక్తిపై కేసు నమోదు చేసిన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామంలో బెల్టుషాపులపై దాడులు నిర్వహిస్తున్న క్రమంలో ఓ ఇంట్లో మద్యం అక్రమంగా నిల్వ ఉంచారని పక్క సమాచారంతో ఆ ఇంట్లో సోదాలు నిర్వహించగా రూ.75,253 విలువ గల మద్యాన్ని స్వాధీనం చేసుకొని యాకయ్య పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపాడు.

గుడుంబా స్థావరాలపై దాడులు

గార్ల: మండలంలోని సేరిపురం పంచాయతీ మర్రిగూడెంలో గ్రామంలో కాపుసారా స్థావరంపై దాడిచేసి 10లీటర్ల కాపుసారా, 300లీటర్ల బెల్లంపానకం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై బానోత్ వెంకన్న సోమవారం తెలిపాడు. మర్రిగూడెం గ్రామానికి చెందిన భూక్యా పూల్‌సింగ్ గ్రామ సమీపంలోని పంటచేలో కాపుసారా కాస్తున్నట్లు పక్కా సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి కాపుసారా, బెల్లంపానకంను ధ్వంసం చేసి పూల్‌సింగ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఏఎస్సై రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.



దంతాలపల్లి: స్వాధీనం చేసుకున్న మద్యం చూపిస్తున్న ఎస్సై



గార్ల: బెల్లంపానకంను ధ్వంసం చేస్తున్న పోలీసులు

నల్లబెల్లం పట్టివేత

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం గ్రామ శివారు పాత తండాలో 70 కిలోల నల్లబెల్లం పట్టుబడినట్లు రూరల్ ఎస్సై బి.రాంచరణ్ సోమవారం తెలిపాడు. శనిగపురం గ్రామ శివారు పాత తండాలో ఆదివారం రాత్రి తనిఖీలు చేయగా బానోత్ వీరన్న ఇంట్లో నల్ల బెల్లం అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించి దానిని స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదు చేశామన్నారు.

లైసెన్స్‌కో రేటు..

- అధికారి చెప్పిన రేటు ఇస్తేనే లైసెన్స్
- లేదంటే ఇబ్బందులు
- వ్యవసాయ శాఖలో యథేచ్ఛగా అక్రమ వసూళ్లు

కొత్తగూడ: ఉద్యోగం దొరకక స్వయం ఉపాధి పొందాలని ఆలోచించి ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల షాపు పెట్టుకోవాలనుకుని లైసెన్స్ కోసం అధికారులను సంప్రదిస్తే లైసెన్స్ ఫీజు తెలుసుకొని నోరెళ్లబెట్టాల్సిందే. ఇప్పటికే షాపులు ఉండి లైసెన్స్ రెన్యూవల్ చేసుకోవాలన్నా అంతే.. కొత్తగా వ్యాపారం చేయాలనుకునే వారు మరో వైపునకు వెళ్తున్నారు. పాత వ్యాపారులు వ్యాపారం చేయాలా.. వదులుకోవాలా.. తేల్చుకోలేక మదన పడుతున్నారు.

వ్యవసాయ అనుబంధ విక్రయాలు చేయాలంటే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయించేందుకు వ్యవసాయ శాఖ జారీ చేసే లైసెన్స్ తీసుకోవాల్సి ఉంటుంది. లైసెన్స్ తీసుకునే వారికి కెమిస్ట్రీ సబ్జెక్టులో డిగ్రీ పూర్తి చేసిన ధ్రువీకరణ పత్రాలు ఉండాలి. ఎరువుల లైసెన్స్‌కు రూ.2500, పెస్టిసైడ్‌కు రూ.1500, సీడ్స్ లైసన్స్ కోసం వెయ్యి రూపాయలను ప్రభుత్వానికి చలానా చెల్లించి షాపు, గోదాంలకు సంబంధించిన ఇంటి పన్ను రశీదులు జత చేసి ఇవ్వాలి. లైసెన్స్‌ల కోసం మండల వ్యవసాయాధికారిని సంప్రదిస్తే మూడు లైసెన్స్‌లకు రూ.50వేల నుంచి రూ.70వేలు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. డబ్బులు ఇస్తేనే పనులు అవుతాయని.. కింది స్థాయినుంచి పైదాకా (జేడీఏ) వరకు ఇవ్వాల్సి ఉంటుందని, బుకాయించి వసూలు చేస్తున్నట్లు సమాచారం. గతంలో షాపులు ఉండి లైసెన్స్ రీన్యూవల్ కోసం వెళ్లినా అంతే వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఒక్క ఎరువుల లైసెన్స్ రిన్యూవల్ కోసం వెళ్లి వారి వద్దనే రూ.28వేలు వసూలు చేసినట్లు సమాచారం. దీంతో ఏడాదంతా వ్యాపారం చేసి అధికారులకే చెల్లించాల్సి వస్తుందని ఎందుకు వ్యాపారం చేయాలని తమలో తాము గుణుగుతున్నారు వ్యాపారులు. ఎవరికైనా చెబుతామంటే బుక్కులు రాయడం లేదని, గోదాంసరిగా లేదని వంకలు పెట్టి కేసులు పెట్టడం, ఇబ్బందులకు గురి చేస్తాడని జంకుతున్నారు. ఇదిలా ఉంటే సీజన్ మామూళ్ల పేరుతో షాపును కు పది వేలు ప్రతీ ఏడాది కట్టించదివించాల్సిందేనని వాపోతున్నారు.



ఎరువుల షాపులో లైసెన్స్‌లు

చర్యలు తీసుకుంటాం

లైసెన్స్ ఫీజు అదనంగా వసూలు చేస్తున్న విషయం తెలియదు. ఇబ్బందులు పడే వ్యాపారులు తమ వద్దకు వస్తే నూతన లైసెన్స్‌లు ఇచ్చే విధంగా చూస్తా. అదనపు వసూళ్లపై విచారించి చర్యలు తీసుకుంటా.

\- జేడీఏ, లక్ష్మీనారాయణ

అమరుల ఆశయాలు సాధిస్తాం..



కొత్తగూడ: అమరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

కొత్తగూడ: అమరుల ఆశయాలను సాధిస్తామని సీపీఐ(ఎంఎల్), ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని మండల కేంద్రంలోని పొలదుగు కృష్ణ స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలో పాలక వర్గాలకు వ్యతిరేకంగా పొలదుగు కృష్ణ పోరాటాలు చేశాడన్నారు. పోడు వ్యవసాయానికి అండగా ఉద్యమాలు చేశాడని ఆయన ఎదుగుదలను ఓర్వలేని కొందరు వ్యక్తులు ఒంటరిగా ఉన్న కృష్ణను హత్య చేశారని అన్నారు. కృష్ణ ఆశయ సాధనలో పార్టీ ఉద్యమిస్తుందన్నారు. కార్యక్రమంలో ములుకూరి రవి, జగ్గన్న, యాకయ్య, సత్యం, సమ్మయ్య, పాపయ్యలు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు మరువలేనివి

బయ్యారం: పీడిత ప్రజల కోసం ఎర్రజెండా నీడన పోరాడి ప్రాణాలు అర్పించిన అమరుల త్యాగాలు మరువలేనివని ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపెల్లి రవి అన్నారు. అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని కొత్తగూడెం, జగత్‌రావుపేట గ్రామాల్లోని అమరవీరుల స్థూపాల వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు జగ్గన్న, సూర్యం, సత్యం, లచ్చయ్య, వెంకన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ‘పెద్ది’ వాహనం తనిఖీ

ఖానాపురం: నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి వాహనాన్ని మండలంలోని మంగళవారిపేటలో చెక్‌పోస్ట్ వద్ద సోమవారం రాత్రి సీఐ కిషన్ తనిఖీ చేశారు. పలు గ్రామాల్లో ప్రచారానికి వెళ్తున్న ఆయన వాహనాన్ని తనిఖీ చేశారు. వాహనంలో ఉన్న వస్తువులు, బ్యాగులు పరిశీలించారు. ఎలాంటి నగదు లభించకపోవడంతో వదిలేశారు.

క్రైం కార్నర్..

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మృతుడు బాలునాయక్

గూడూరు: హైదరాబాద్ నుంచి రాత్రి ఇంటికి వచ్చిన వ్యక్తి తెల్లవారే సరికి అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉన్న సంఘటన మండలంలోని కోబల్‌తండా శివారు మూడుగుడిసెలలైన్‌తండాలో సోమవారం జరిగింది. మృతుడి తమ్ముడు కేలోతు హాల్యానాయక్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు.. కేలోతు బాలూనాయక్ (38) భార్య గుడితోపాటు కూతురు, కుమారుడితో కలసి బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లి కూలి పనులు చేసుకుంటున్నారు. ఈక్రమంలో బాలూనాయక్ మూడుగుడిసెలలైన్‌తండాలో ఇంట్లో మరమ్మతులు చేయడానికి ఆదివారం అర్ధరాత్రి ఓ వ్యక్తితో వచ్చాడు. ఆ వ్యక్తితో ఇంట్లో రాత్రి నిద్రించాడు. సోమవారం హైదరాబాద్‌లో ఉన్న భార్య, బాలూనాయక్‌కు ఫోన్‌చేస్తే ఎత్తకపోవడంతో పక్కింటి వారికి ఫోన్ చేసింది. వారు వెళ్లి చూడగా బాలూనాయక్ మృతి చెంది ఉన్నాడు. అనుమానం వ్యక్తం చేస్తూ రాత్రి అతని వచ్చిన వ్యక్తి కనిపించడంలేదని తెలిపారు. ఈ విషయం తెల్సుకున్న తండావాసులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. తమ్ముడు హాల్యానాయక్ తన అన్న బాలూనాయక్ మరణానికి వదిన గుడి అక్రమ సంబంధం కారణమై ఉంటుందని, అన్నతో వచ్చిన వ్యక్తి చంపి పరారైనట్లు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాణాప్రతాప్ తెలిపాడు.

భార్యను హత్య చేసిన భర్తకు రిమాండ్



నిందితుడిని చూపిస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్సై

దంతాలపల్లి: కట్టుకున్న భార్యను కడతేర్చిన కసాయి భర్తను రిమాండ్‌కు పంపిన సంఘటన సోమవారం మండలకేంద్రంలో చోటు చేసుకుంది. తొర్రూర్ టౌన్ డీఎస్పీ వెంకటేశ్వరబాబు తెలిపిన వివరాలప్రకారం.. మండలంలోని తూర్పుతండాకు చెందిన గుగులోత్ సారమ్మ(30) ఈనెల 1న ఇంట్లో ఉరివేసుకొని మృతిచెందింది. విషయంపై మృతురాలు తండ్రి బిచ్యా తన కూతురు భర్త, అత్త మామ వేదింపులతో చనిపోయిందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తులో భాగంగా ఆత్మహత్య కాదని హత్యే అని పోలీసులు తేల్చేశారు. తొర్రూరు టౌన్ సీఐ, ఎస్సై రాజేందర్‌ను విచారించగా.. తన భార్య అనారోగ్యం బాగా లేదని, ఆ జబ్బు పిల్లలకు ఎక్కడ వ్యాప్తి చెందుతుందో అని, తన బయటి తిరుగుళ్లకు అడ్డు చెప్పుతుండడంతో చీరతో గొంతు నులిమి చంపి హత్యను ఆత్మహత్యగా సృష్టించాడని పోలీసులు తెలిపారు. నిందితుడు రాజేందర్‌ను రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వెంకటేశ్వరబాబు తెలిపారు. సీఐ సత్యనారాయణ, ఎస్సై రమేష్‌బాబు ను అభినందించారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడి..

కేసముద్రం: విద్యుదాఘాతంతో ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కోరుకొండపల్లి జరిగింది. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎర్రం వెంకటాచలం(61) ఆదివారం సాయంత్రం స్నానం చేసేందుకుగాను విద్యుత్ మోటార్‌ను ఆన్ చేశాడు. నీళ్లు రాకపోవడంతో మోటార్‌ను రిపేరు చేసేందుకు పట్టుకున్నాడు. ఈ క్రమంలో అప్పటికే విద్యుత్ సరఫరా అవుతుండడంతో షాక్‌కు గురై మృతి చెందాడు. పని నిమిత్తం బయటకు వెళ్లి వచ్చిన కుటుంబసభ్యులు కిందపడి ఉన్న వెంకటాచలాన్ని చూసి మృతి చెందినట్లు గుర్తించి బోరున విలపించారు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు ప్రవీణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి సోమవారం తెలిపారు.

ప్రభుత్వ విధానాలతో ప్రజల ఇబ్బందులు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న విజయసారథి

నెహ్రూసెంటర్: మండలంలోని ముడుపుగల్ గ్రామానికి చెందిన విద్యా కమిటీ ఎస్‌ఎంసీ చైర్మన్ జుజ్జూరి గురుస్వామి సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి ఆధ్వర్యంలో సోమవారం సీపీఐలో చేరారు. ఈ సందర్భంగా విజయసారథి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల ద్వారా ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్ సారథి, కట్లోజు పాండురంగాచారి, తండా సందీప్, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, తేజావతి శ్రీను పాల్గొన్నారు.

భగవద్గీత ప్రాముఖ్యితపై ప్రచారం

కొత్తగూడ: భగవద్గీత ప్రతీ ఒక్కరు ఆచరించదగిందని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి జిల్లా కమిటీ సభ్యుడు ఓంప్రకాశ్ అన్నారు. భగవద్గీత ప్రాముఖ్యతను మండల కేంద్రంలో ప్రచారం చేశారు. ప్రపంచానికే ధర్మాన్ని బోధించి మానవులు నడవాల్సిన విధానాలను గీత తెలియచేస్తుందన్నారు. పాశ్చాత్య దేశాలు గీతను ఆచరిస్తున్నా గీత పుట్టిల్లు అయిన భారతదేశంలో మాత్రం చాలా మందికి గీత ప్రాశస్త్యం తెలియదన్నారు. అందుకే సేవా సమితి ఆధ్వర్యంలో గీత ప్రాముఖ్యతను తెలియచేస్తూ ప్రతీ ఇంటికి అందేలా చేయడమే సంస్థ ముఖ్య ఉద్దేశం అన్నారు. అందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కిరణ్‌చారి, రావణ్‌చారి, విక్రమ్, బాబు, శ్రీనివాస్, అజయ్, నిర్మల పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న సేవా సమితి సభ్యులు

మహాసభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న యాకయ్య

కొత్తగూడ: విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు మిడుతపల్లి యాకయ్య కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీల వర్గీకరణ కోరుతూ మందకృష్ణ మాదిగ చేపట్టిన పాదయాత్ర ముగింపు సందర్భంగా ఈనెల 11న హైదరాబాద్‌లో జరిగే మహాసభకు మండలం నుంచి భారీగా తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు మైసు సమ్మయ్య, అనిల్, చిరంజీవి, సూరయ్య, శంకర్, జంపయ్య, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

చేరికలు.. రాజీనామాలు

కురవి: డోర్నకల్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి భూక్య సంగీతనాయక్ ఆధ్వర్యంలో సోమవారం అయ్యగారిపల్లి, కొత్తూరు(జీ) గ్రామం నుంచి బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి 150 మంది కార్యకర్తలు బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి సంగీత పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రామచంద్ర రావు, కార్యదర్శి చీకటి మహేష్‌గౌడ్, నాయకులు పాకనాటి దామోదర్‌రెడ్డి, పూర్ణచందర్‌రెడ్డి, బుడిగ భద్రసేనాగౌడ్, పెంటయ్య పాల్గొన్నారు.

బీజేపీకి రాజీనామా

తొర్రూరు: బీజేపీ విధానాలు నచ్చకే పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెదగాని సోమయ్య తెలిపాడు. సోమవారం డివిజన్ కేంద్రంలోని పెదగాని సోమయ్య స్వగృహంలో ఆయన మద్దతుదారులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో బీజేపీ జిల్లా కార్యదర్శి పరుపాటి రామ్మోహన్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మనబోయిన కుమార్, మహిళా నాయకురాలు పైండ్ల లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక



కురవి: సంగీత ఆధ్వర్యంలో బీజేపీలో చేరుతున్న నాయకులు

కేసముద్రం: కేసముద్రం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన యువకులు 150 మంది సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండల యూత్ ఉపాధ్యక్షుడు తోట అఖిల్, ఎండీ రఫీ, అరుణ్, అభి, దినేష్, బానోత్ నరేష్, గుగులోత్ బీమా, మురారీ, నిఖిల్ పార్టీలో చేరారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

గూడూరు: మండలంలోని సీతానగరం మాజీ ఎంపీటీసీ, సీనియర్ నాయకుడు కోమాండ్ల రమణారెడ్డి రాజీనామా చేసి, సోమవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మురళీనాయక్ సమక్షంలో చేరారు.

కరాటే చాంపియన్‌షిప్‌లో విద్యార్థి ప్రతిభ



నర్సంపేట : ఖమ్మం జిల్లాలోని వర్తక సంఘం భవనంలో సుమన్ షోటోఖాన్ స్పోర్ట్స్ కరాటే డూ అకాడమీ ఇండియా వారు నిర్వహించిన 27వ నేషనల్ కరాటే చాంపియన్ షిప్‌లో పట్టణంలోని మదర్స్‌ల్యాండ్ హైస్కూల్ విద్యార్థి మొగులోజు విఘ్నేశ్వరచారి 15 ఏళ్ల బాలల విభాగంలో పాల్గొని అత్యంత ప్రతిభ కనబర్చి బంగారు పతకాన్ని సాధించారు. కరాటే మాస్టర్ షేక్ జానీ, విగ్నేశ్వర చారిని ప్రముఖ సినీనటుడు సుమన్ అభినందించి బంగారు పతకం, కరాటే ట్రోఫీని అందజేశారు. సోమవారం పాఠశాల చైర్మన్ పి.రమేష్, ప్రిన్సిపాల్ నవితలు వారిని అభినందించారు. భవిష్యత్తులో ఇలాంటి కరాటే ఛాంపియన షిప్‌లలో పాల్గొని అత్యంత ప్రతిభ కనబర్చి మంచి గుర్తింపు తీసుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి

నర్సంపేట రూరల్ : అనారోగ్యంతో శతాధిక వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండలంలోని మహేశ్వరం శివారు అమృతండాలో సోమవారం చోటుచేసుకుంది. మహేశ్వరం గ్రామ శివారు అమృతండాకు చెందిన గుగులోతు కనకమ్మ (110) మృతి చెందింది. కనకమ్మకు ఆరుగురు కుమారులు, ఒక కుమార్తె జన్మించారు. అందరు మృతి చెందగా ఒక కుమారుడు మాత్రమే ఉన్నాడు.

పార్టీల విస్తృత ప్రచారం

సాక్షి నెట్‌వర్క్: మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజలకు పాలేరులా పనిచేసి రుణం తీర్చుకుంటానని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ శంకర్ నాయక్ అన్నారు. మహబూబాబాద్ రూరల్ మండలంలోని బలరాం తండా, ఆమనగల్లు, గుండాల గడ్డ తండ, ఇస్లావత్ తండా, సింగారం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. గంగారం మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి బడె నాగజ్యోతి ప్రచారం ప్రారంభించారు. అభివృద్ధి రెడ్యానాయక్‌తోనే సాధ్యమవుతుందని డోర్నకల్ మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు ఓటెయ్యాలని మరిపెడ మండల పరిషత్ వైస్ ఎంపీపీ గాదె అశోక్ రెడ్డి ప్రచారం చేశాడు.

కాంగ్రెస్..

పార్టీ అధికారంలోకి రాగానే రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య మురళీనాయక్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో కమ్మగాని కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శంతన్ రామరాజు అధ్యక్షతన ‘నిరుద్యోగ గోస’ సదస్సు సోమవారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో తెలిపించాలన్నారు. మహబూబాబాద్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి శంకర్‌నాయక్ ఓటమి ఖాయమని వైఎస్సార్ టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుగులోత్ రాములునాయక్ అన్నారు. కేసముద్రం మండలం తౌర్య తండాలో సోమవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో యాన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని తండాలన్ని మూకుమ్మడిగా కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలుకుతున్నాయని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి తీసుకరావడమే లక్ష్యంగా పని చేసేందుకు కలసి రావాలని పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి కోరారు.

బీజేపీ..

పల్లెపల్లెకు బీజేపీ ఇంటింటికి హుస్సేన్ నాయక్ ప్రజా ఆశీర్వాద యాత్ర నెల్లికుదురు మండలంలోని మునిగలవీడు, మధనతుర్తి, రావిరాల గ్రామాలల్లో సాగింది. బీజేపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రచారం చేశాడు. అనంతరం పలువురు బీజేపీలో చేరారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

జనగామ రూరల్: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సామాజిక వైద్యాధికారి రెహమాన్ అన్నారు. సోమవారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏఎన్‌ఎంలు ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రజాస్వామ్యాన్ని పటిష్టపరిచేందుకు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు లావణ్య, నీలిమ, ఉపేంద్ర, అనిత, మంగ, స్వప్న పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

దేవరుప్పుల: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండేలా ఆరోగ్య సిబ్బంది చర్యలు చేపట్టాలని ఇన్‌చార్జ్ డాక్టర్ భాస్కర్ సూచించారు. సోమవారం మండల ఆరోగ్య కేంద్రంలో సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం లేకుండా గ్రామ పంచాయతీలకు గుర్తుచేస్తూ దోమల నివారణకు పాటుపడాలన్నారు. ఫార్మెట్ వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు.

విద్యార్థులకు టై, బెల్ట్‌ల పంపిణీ



మహబూబాబాద్ అర్బన్: తెలుగు సమితి ఆఫ్ నెబ్రాస్కా స్ఫూర్తి ఎడ్యుకేషన్ సొసైటీ గౌరవ సభ్యుడు రాయపాటి కృపాకర్ సహకారంతో జిల్లా కేంద్రంలోని నందినగర్ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం సంఘం అధ్యక్షుడు రామసహాయం శ్రీధర్ రెడ్డి విద్యార్థులకు టై, బెల్టులు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశాడు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలాజీ, స్ఫూర్తి ఎడ్యుకేషనల్ గౌరవ కోశాధికారి ఆకుల శ్రీకాంత్, ఉపాధ్యాయులు బోయిన శ్రీను, పోరెడ్డి శ్రీను, హెల్పర్ సైదమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.